సాక్షి మెదక్

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



సైదయ్యకు సలాం

రాజకీయాల్లోకి వచ్చి చాలామంది ఆస్తులు, అంతస్థులు సంపాదించాలని అనుకుంటారు. కానీ, దివంగత ఎమ్మెల్యే సైదయ్య మాత్రం మంచి పేరు తెచ్చుకున్నారు. వివరాలు 10లో ▸



కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ ఖతం

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ ఖతం అవుతుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ప్రజలకు సూచించారు. వివరాలు 10లో ▸



పోడు సమస్యలు పరిష్కరిస్తా..

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే రుక్మాపూర్ పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తానని దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. వివరాలు 11లో ▸

ఓటింగ్ పెంచుతాం..



శాసనసభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఈసారి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలు మించరాదని తెలిపారు. వందశాతం ఓటింగ్, యువత ఓటింగ్ శాతం పెంపు, దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం, ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ, ఈవీఎంల నిర్వహణ, పకడ్బందీ నిఘా తదితర అంశాలపై గురువారం ఆయన 'సాక్షి'కి వెల్లడించారు. కలెక్టర్ వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే...

– మెదక్/మెదక్ కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

- 31 వరకు కొత్తవారు నమోదు చేసుకోవచ్చు
- అభ్యర్థులు నిబంధనలు పాటించాలి
- ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలు మాత్రమే
- డబ్బులు, మద్యానికి అడ్డుకట్ట
- కళాజాత ప్రచార రథానికి శ్రీకారం
- సాక్షితో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

జిల్లాలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా అన్ని విధాలుగా చర్యలు చేపట్టాం. 2018లో జరిగిన ఎన్నికల్లో 81.31శాతం పోలింగ్ జరిగింది. ఈసారి దాన్ని వందశాతం జరిగే విధంగా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలతోపాటు ప్రధాన కూడళ్లు మండల కేంద్రాలు, జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో కళాజాత ప్రదర్శనల ద్వారా ఓటు హక్కు, ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా మండల కేంద్రాలకు వాహనం వెళ్లినప్పుడు ఎంపీడీఓ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఇతర శాఖ అధికారులు అక్కడికి వెళ్లి ప్రజలను చైతన్యం చేస్తారు. సమావేశాల్లో ఎస్పీతోపాటు తాను పాల్గొనడం జరుగుతుంది. అలాగే ఓటరు జాబితాలో ఉండి చనిపోయిన వారు లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఓటు వేసేందుకు రాకుంటే ఓటింగ్ శాతం తగ్గవచ్చు.

2,710 మంది నియామకం

➡ మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలతోపాటు పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్, తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి మండలాలకు కలిపి ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 2,710 మందిని నియమించాం. ఇందులో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓపీఎస్‌లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. మరోసారి సైతం శిక్షణ ఇవ్వనున్నాం.

చెక్ పోస్టులతో పకడ్బందీ నిఘా..

➡ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా జిల్లాలోకి మద్యం, డబ్బులు, ఇతర కానుకలు రాకుండా ఉండేందుకు జిల్లా చుట్టూ ఏడు చెక్ పోస్టులను పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు రూ.కోటి 26 లక్షలు సీజ్ చేశాం. ఇందులో లెక్కలు చూపించిన వారికి రూ.27లక్షలు అందించాం. లెక్కలు చూపించని వారికి సంబంధించిన రూ.86 లక్షలు ఐటీకి అందజేశాం. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తారు. ఇందుకు సంబంధించిన లెక్కలను గ్రీవెన్స్ కమిటీకి చూపించినట్లయితే ఐదు రోజుల్లో డబ్బులు అందజేస్తారు.

సీసీ కెమెరాలతో నిఘా..

➡ ప్రశాంతంగా ఎన్నికలు జరుగాలంటే సెక్టార్ అధికారులతోపాటు పోలీసు ఉన్నతాధికారులకు శిక్షణ ఇచ్చాం.ఇప్పటికే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాం. జిల్లాలో ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాం.

రాజకీయ నాయకుల సమక్షంలో...

➡ పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఎన్నికల సంఘం గుర్తించిన అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలోనే ఈవీఎంలను పరిశీలించాం. నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో వినియోగించే వారి ముందే వీటిని పరిశీలించాం.ఈవీఎం ఎక్కడ పెడుతున్నామనే విషయాలను వారికి తెలియజేశాం.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు

➡ పోలింగ్ బూత్ వద్దకు వచ్చేందుకు ఆరోగ్యం సహకరించని దివ్యాంగులు, వయో వృద్ధులకు ఇంటి నుంచే ఓటువేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందుకు సంబంధించిన ఫామ్ 12డీ సంబంధీకులకు ఇవ్వడం జరుగుతుంది. పోలింగ్ బూత్‌కు రాలేని స్థితిలో ఉన్న వారు ఫామ్‌ను నింపి తమకు అందజేస్తే వారికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తాం. అలాగే అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేశాం. జిల్లాలో 579 పోలింగ్ బూత్‌లకు గానూ 410 లోకేషన్లను గుర్తించాం. వీటి పరిధిలో ఇప్పటికే 200 వీల్ చైర్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైతే మరిన్ని తెప్పిస్తాం.

రూ.40 లక్షలు మాత్రమే..

➡ ఎన్నికల బరిలో నిలబడే ఒక్కో అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు మించరాదు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు రూ.28 లక్షలు ఉండగా, ఈసారి మరో రూ.12 లక్షలను ఎన్నికల కమిషన్ పెంచింది. కరపత్రాలు, బ్యానర్లు, ప్రచార వాహనాలు, ర్యాలీలు తదితర ఖర్చుల నిమిత్తం నామినేషన్ వేయగానే ప్రత్యేకంగా అభ్యర్థులు బ్యాంకు ఖాతాను ఓపెన్ చేసి రోజువారీ ఖర్చులను లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా నిబంధనలు పాటించని అభ్యర్థులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ రాజర్షి షా



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

హవేళిఘణాపూర్(మెదక్): సాధారణ ఎన్నికల్లో భాగంగా హవేళిఘణాపూర్ మండల కేంద్రంలో వైపీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం వైపీఆర్ కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గంలోని కౌంటింగ్ రోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, నవంబర్ 15లోపు కౌంటింగ్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్‌నెట్, మీడియా పాయింట్, బారికేడ్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా తాగునీటి వసతి లాంటి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం సాయంత్రం వీవీ ప్యాట్‌లను భద్రపరచడానికి పిల్లికొట్టాల్‌లోని పాత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించాని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్, నర్సాపూర్ ఆర్డీఓలు అంబదాస్, శ్రీనివాస్, మెదక్, హవేళిఘణాపూర్ తహసీల్దార్లు శ్రీనివాస్, నారాయణ, పంచాయతీరాజ్ ఈఈ నర్సింలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

30, 31 తేదీల్లో శిక్షణ తరగతులు

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 30, 31 తేదీల్లో ఎన్నికల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ర్యాండమైజేషన్ ద్వారా జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ 955, ఏపీఓ 955, ఓపీఓల 1842 మంది సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు.

ప్రలోభాలకు గురి కావొద్దు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ

కౌడిపల్లి(నర్సాపూర్):ఓటు విలువైనది, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ తెలిపారు. గురువారం కొడిపల్లి అంగడిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళ, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మద్యం, ఇతర బహుమతులకు ఓటును అమ్ముకోవద్దన్నారు. అనంతరం ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఐడీసీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమ భార్గవి, కౌడిపల్లి, శివ్వంపేట మండల సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి, సంతోష, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ బీ. సంతోష, ఏపీఎం సంగమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల పాల్గొన్నారు.

ఘనపురం ఆనకట్ట ఇంచు పెంచలే : రోహిత్



మాట్లాడుతున్న రోహిత్

పాపన్నపేట(మెదక్): సీఎం కేసీఆర్ ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంచేందుకు నిధులు మంజూరు చేశాడని చెబుతున్నారు. కానీ ఒక్క ఇంచుమందమైనా పెంచలేదని మెదక్ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ విమర్శించారు. గురువారం పాపన్నపేటలో జరిగిన సమావేశంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మల్లంపేట సర్పంచ్ బాపురెడ్డి, కొత్తపల్లి సొసైటీ డైరెక్టర్ కిష్టయ్య, ఆత్మకమిటీ డైరెక్టర్ పద్మారావు, ముద్దాపూర్ ఉప సర్పంచ్ భూమయ్య, మండల గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు సత్తాగౌడ్‌తోపాటు సుమారు వెయ్యి మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ చందనాప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కొడుపాక మాజీ సర్పంచ్ పంతుల భూమయ్య, మిన్‌పూర్ రాములు, ఎంపీటీసీలు మౌనిక, నాగమణి, ఆకుల శ్రీను, రాము, బొల్లి మల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కొండల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి: హేమలత



ప్రచారం నిర్వహిస్తున్న హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): కేసీఆర్ మూడోసారి గజ్వేల్ నుంచి నిలబడతున్నారని, ప్రజలు ఆయనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత కోరారు. గురువారం మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు గ్రామాన్ని దత్తత తీసుకొని రెండు కోట్ల వరకు అభివృద్ధి పనులు చేశామని, ఇంటింటికీ కేసీఆర్ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు రేణుకా, మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే, గ్రామంలో ఉన్న 20 దళిత కుటుంబాలకు దళితబంధు ఎందుకు ఇవ్వలేదని దళితులు నిరసన వ్యక్తం చేశారు.

భరోసా కోసమే ఫ్లాగ్ మార్చ్



పాపన్నపేట(మెదక్): ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్

పాపన్నపేట(మెదక్): ప్రజల భద్రతే లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ తెలిపారు. గురువారం పాపన్నపేట, కొత్తపల్లి, యూసుఫ్‌పేట, మల్లంపేట, కోడుపాక, పాత లింగాయపల్లి గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. వచ్చే నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్న లక్ష్యంతో సీఆర్పీఫ్, సివిల్ పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఫణీంద్ర, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్సై మహిపాల్ రెడ్డి, కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్, పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

కొల్చారం(నర్సాపూర్): ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు, వారిలో ధైర్యాన్ని నింపేందుకు ఎస్పీ ఆదేశాలతో గురువారం మండలంలోని పైతర, రంగంపేట,సంగాయపేట, చిన్నఘనపూర్, కొల్చారం గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఫణీంద్ర, మెదక్ రూరల్ సీఐ రాజ శేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్, పాపన్నపేట ఎస్ఐ మహేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చిలుముల సుహాసినిరెడ్డి

- కుమారుడితో సహా మరో ఇద్దరు చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్, ఠాక్రే



మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సుహాసినిరెడ్డి, ఇతర నాయకులు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ నేత చిలుముల సుహాసినిరెడ్డి, ఆమె కుమారుడు చిలిపిచెడ్ మాజీ జెడ్పీటీసీ శేషాసాయిరెడ్డి, మరో ఇద్దరు నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, కౌడిపల్లి మండల బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణాగౌడ్‌లతో కలిసి ఢిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుహాసినిరెడ్డి, శేషాసాయిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తాము ఎలాంటి పదవులు ఆశించి కాంగ్రెస్‌లో చేరలేదన్నారు. ఏమైనా పదవులు ఆశిస్తున్నారా.. అని మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్ అడిగారని, తమకు పదవులు వద్దన్నామని చెప్పారు. తమ అనుచరులకు పార్టీలో సముచిత స్థానం ఇవ్వాలని కోరగా, రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మైనంపల్లి కలిసిన రెండు రోజులకే..

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఈనెల 24 వ తేదీన కౌడిపల్లిలోని సుహాసినిరెడ్డి ఇంటికి వెళ్లి ఆమెను కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించిన విషయం తెలిసిందే. టికెట్ రాక అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరికపై స్పష్టత ఇవ్వకపోవడంతో మైనంపల్లి చిలుముల కుటుంబంపై దృష్టి సారించారు. సుహాసినిరెడ్డి కుటుంబాన్ని కాంగ్రెస్‌లో చేర్పించేందుకు పావులు కదిపారు.

అనుచరులకు మదన్‌రెడ్డి సూచనలు

తాను బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తన అనుచరులకు గురువారం హితవు పలికినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ముఖ్య అనుచరులను హైదరాబాద్ పిలిపించుకొని వారితో మాట్లాడారు. అలాగే, హత్నూర మండలంలోని ఓ నాయకుడి గెస్ట్‌హౌస్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నర్సాపూర్ టికెట్ సునీతారెడ్డికి ఇచ్చారని, తనకు మెదక్ ఎంపీ టికెట్ ఇస్తానని సీఎం హామీ ఇచ్చారని, సునీతారెడ్డిని గెలిపించేందుకు అందరం సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఆ మూడింట ఉత్కంఠ

ఖేడ్, నర్సాపూర్, పటాన్‌చెరు టికెట్‌ల కేటాయింపుపై ఆశావహుల ఎదురుచూపు

- ఒక్కో చోట పోటీ పడుతున్న ఇద్దరు, ముగ్గురు
- ఆచితూచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : టికెట్ల ఖరారులో కాంగ్రెస్ అధినాయకత్వం ఆచితూచి వ్యవహరిస్తుండగా ఆశావహుల్లో టెన్షన్ కొనసాగుతోంది. ప్రధానంగా ఇద్దరు, ముగ్గురు గట్టి నాయకులు.. ఆశిస్తున్న నియోజకవర్గాలు, కొత్త నాయకులు పార్టీలో చేరే అవకాశాలున్న స్థానాల టికెట్లు ఖరారు చేసే విషయమై హస్తం పార్టీ అధిష్టానం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. దీంతో జిల్లాలో ఉన్న నారాయణఖేడ్, నర్సాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాల టికెట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నర్సాపూర్‌లో వ్యూహాత్మకంగా..

నర్సాపూర్ టికెట్ విషయంలోనూ కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. బుధవారం వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వంపై పూర్తిస్థాయిలో స్పష్టత రాకపోవడంతో కాంగ్రెస్ కూడా ఈ టికెట్‌ను ఖరారు చేయలేదు. పార్టీ నుంచి ఆశావహులైన గాలి అనీల్ కుమార్, ఆవుల రాజిరెడ్డి రేసులో ఉన్నారు. దామోదర రాజనర్సింహ ద్వారా రాజిరెడ్డి టికెట్ ప్రయత్నాల్లో ఉండగా, రేవంత్‌రెడ్డి ద్వారా గాలి అనీల్‌కుమార్ ఆ ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం విషయంలో ఇప్పుడు పూర్తి స్థాయిలో స్పష్టత రాగా కాంగ్రెస్ ఒకట్రెండు రోజుల్లో విడుదల చేయనున్న రెండో జాబితాలో ఈ టికెట్ సైతం ప్రకటించే అవకాశాలున్నాయి. పటాన్‌చెరుపైనా ఉత్కంఠ కొనసాగుతోంది. తనకే టికెట్ వస్తుందనే సంకేతాలుండటంతో కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో ఇంటింటా ప్రచారం, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ ఇక్కడ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నీలం మధు పార్టీలో చేరుతారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. పార్టీ అధినాయకత్వం కూడా మధును పార్టీలో చేర్చుకునే ప్రయత్నాల్లో ఉందనే ప్రచారం జరుగుతోంది. టికెట్ ఖరారు చేస్తే ఆ పార్టీ కండువా కప్పుకుంటానని ఆయన స్పష్టం చేస్తున్నారు.



నిర్ణయం సీఈసీకే..

జిల్లాలో ఈ మూడు నియోజకవర్గాల విషయంలో ఆ పార్టీ స్క్రీనింగ్ కమిటీలో ఏకాభిప్రాయం రాకపోవడంతో నిర్ణయం సీఈసీకి వదిలేసినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీకి విధేయత, సర్వేల ఫలితాలు, సామాజిక సమీకరణాలు, ఆర్థికబలం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఏ అంశం ఎవరికి టికెట్ వచ్చేలా చేస్తుందనేది ఆ పార్టీ జాబితా విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

13 ఏళ్లుగా ప్రజలు గుర్తు రాలేదా?

- కొడుకును తెచ్చి, ఈడపెడితే ఎవరు మోయాలి?
- మైనంపల్లిని ప్రశ్నించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



రాంపూర్ గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): 13 ఏళ్ల కిందట జిల్లాను వదిలిపెట్టి వెళ్లిన నీకు మళ్లీ మెదక్ నియోజకవర్గ ప్రజలు గుర్తుకొస్తున్నారా.. ఇన్ని రోజులు గురు రాలేదా.. అని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మైనంపల్లి హన్మంతరావును ప్రశ్నించారు.నీ కుమారుడిని ఎమ్మెల్యేగా తెస్తున్నావు.. 26 ఏళ్ల పిల్లగాడిని ఇక్కడ వదిలిపెట్టి వెళ్తానంటున్నావు.. ఆయన్ను ఎవరు మోయాలంటూ విమర్శించారు. గురువారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ మేరకు గ్రామంలోని ప్రధాన దేవాలయాలు వేణుగోపాలస్వామి, హనుమాన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 23 ఏళ్లుగా నన్ను ఒక ఆడబిడ్డగా ఆదుకున్నారని తెలిపారు. అలాగే మైనపల్లి హన్మంతరావు 2008 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉండి ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ మనకు రైతుబంధు, రైతుబీమా, పెన్షన్లు, కల్యాణ లక్ష్మీ, మంచినీళ్లు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, పలు గ్రామాల సర్పంచులు అమరసేనారెడ్డి, కవిత, ఎంపీటీసీలు బాల్ రెడ్డి, సురేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కల్వకుంట, నిజాంపేట సొసైటీ చైర్మన్లు కొండల్ రెడ్డి, బాపురెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్, నాయకులు నాగరాజు, రామాగౌడ్, రాజు, స్వామి, ప్రజలు పాల్గొన్నారు.

రేపు మధ్యాహ్నం నాచగిరి ఆలయం మూసివేత

చంద్రగ్రహణం ఎఫెక్ట్

వర్గల్(గజ్వేల్): చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఒంటిగంటలోపు నాచగిరి శ్రీస్వామివారి నిత్యపూజలు, మహానివేదన నిర్వహించి ఆలయం మూసివేస్తామని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. ఆదివారం మహాసంప్రోక్షణ, శ్రీవారికి అభిషేకం, అలంకరణ అనంతరం ఉదయం 9 గంటల నుంచి యథావిధిగా భక్తులకు దర్శనం, అర్జితసేవలు జరుగుతాయన్నారు.

సైదయ్యకు సలాం..

- నాలుగు పర్యాయాల 'ఎమ్మెల్యేగిరి'
- ప్రజా సేవే పరమావధి..
- నయాపైసా కూడబెట్టని నిజాయితీ
- ఇదీ గజ్వేల్ సైదయ్య జీవితం
- ప్రభుత్వమిచ్చిన ఆస్తులు కూడా దక్కని దైన్యం
- కుటుంబికులదీ సాధారణ జీవనమే

గజ్వేల్: రాజకీయాల్లోకి వచ్చి చాలామంది ఆస్తులు, అంతస్తులు సంపాదించాలని అనుకుంటారు. కొందరు మాత్రమే మంచి పేరు తెచ్చుకోవాలని చూస్తారు. అలాంటి కోవకు చెందినవారే గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే దివంగత సైదయ్య. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆ వ్యక్తి ఆదర్శానికి మచ్చుతునకగా నిలిచారు. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా సాధారణ జీవితంతో ప్రజా సేవే పరమావధిగా ముందుకుసాగారు. భర్త అడుగుజాడల్లోనే అతి సాధారణ జీవితాన్ని గడిపిన సాయమ్మ సైతం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేకుండానే ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. వారసులు కూడా సాధారణ జీవితం గడుపుతున్నారు.

గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన నిరుపేద ఎస్సీ కుటుంబానికి చెందిన గజ్వేల్ సైదయ్య(ఇంటి పేరు కూడా గజ్వేలే) గ్రామంలోని దొరల వద్ద జీతం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈక్రమంలోనే 1962లో గజ్వేల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. అప్పటి నుంచి 1967, 1972, 1978 సంవత్సరాల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు ఎనలేని సేవలందించారు. 1983, 1985లలో ఓటమి పాలయ్యారు. 1989లో మరణించారు. ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో సైదయ్య ఆర్టీసీ బస్సుల్లో గ్రామగ్రామాన పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేసేవారు. చిత్తశుద్ధితో పదవికి వన్నె తెచ్చిన ఆయనను అప్పట్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి చెన్నారెడ్డిలు ప్రముఖంగా గుర్తించారు. ఈ క్రమంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యునిగా, లిడ్‌క్యాప్ మెంబర్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. తన వ్యక్తిగత సమస్యలపై గానీ, ఆస్తులను సంపాదించుకోవాలని కానీ సైదయ్య ఏనాడు దృష్టిసారించలేదు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో సైదయ్యకు మిగిలింది పెంకిటిల్లు మాత్రమే. నేటి రాజకీయ పరిస్థితుల్లో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే చాలు లక్షల రూపాయలు అక్రమంగా సంపాదించుకునే వ్యక్తులున్న ఈ రోజుల్లో సైదయ్య పరి స్థితి భిన్నంగా ఉందంటే అతిశయోక్తి కాదు. ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో హైదరాబాద్‌లోని ఓ హౌసింగ్ సొసైటీ ద్వారా సైదయ్యకు ఇంటి స్థలం కేటాయించారు. కొంతకాలం ఆయన అక్కడే ఉన్నారు. అనంతరం ఏమి జరిగిందోగానీ ఆస్తంతా ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీనిని దక్కించుకోవడానికి సైదయ్య దత్త పుత్రుడు క్రిష్ణ ప్రయత్నించి విఫలమయ్యారు. అతను కూడా అనారోగ్యం కారణంగా 1996లో మరణించాడు. ఆ తర్వాత ఆ కుటుంబంలో సైదయ్య సతీమణి సాయమ్మ, కోడలు కమల, ఆయన మనుమలు, మనుమరాళ్లు మిగిలిపోయారు. దశాబ్దాలుగా ఈ కుటుంబం ఎన్నో కష్టాలను అనుభవించింది. కమల తన కుమారులు, కూతురిని ప్రయోజకులను చేయడానికి నానా యాతన పడింది. పదేళ్ల క్రితం ఆమె కుమారుడు వెంకట్‌కిరణ్‌కు టీచర్ ఉద్యోగం రావడంతో ఆ కుటుంబానికి కొంత ఊరట లభించింది.



గజ్వేల్‌లోనూ దక్కని ఇంటి స్థలం

1976లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఇంటి నిర్మాణం కోసం సైదయ్యకు 7.5గుంటల స్థలాన్ని కేటాయించారు. కానీ హద్దులు చూపలేదు. ఈ స్థలాన్ని ఇప్పించాలని సాయమ్మ కలెక్టరేట్, రెవెన్యూ అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. 2006లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.30వేల ఆర్థిక సాయం, ఎమ్మెల్యే పింఛన్ మినహా సాయమ్మకు ఎలాంటి సాయం అందలేదు. చివరకు ఎలాంటి గుర్తింపు లేకుండానే 2015 ఆగస్టు 11న సాయమ్మ తుది శ్వాస విడిచారు. 'మా మామ నాలుగుసార్లు ఎమ్మెల్యేఅయ్యి ఎన్నో మంచి పనులు జేసిండు... నయా పైసా సంపాదించుకోలే. మాకున్న రెండెకరాల భూమి కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో పోయింది. మా కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలె'..అంటూ సైదయ్య కోడలు కమల కోరింది.

ప్రస్తుతం రెండో కుమారుడు వేణుగోపాల్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు కీర్తిక ఎమ్మెస్సీ, బీఎడ్ పూర్తి చేసింది. మూడో కుమారుడు శైలేష్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు.


అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో సైదయ్య (ఫైల్)


గజ్వేల్ మండలం కొడకండ్లలోని దివంగత ఎమ్మెల్యే సైదయ్య ఇల్లు


కుటుంబ సభ్యులతో సైదయ్య సతీమణి సాయమ్మ

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ ఖతం

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్)/రామాయంపేట: కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ ఖతం అవుతుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆమె పాపన్నపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మండల పరిధిలోని డాక్యాతండా, రాజ్యాతండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలూ కరెంట్ ఇస్తుందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే అసైన్‌మెంట్ భూముల నిబంధనలను సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు. తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న లక్ష్యంతో తండాలను గ్రామ పంచాయతీలుగా చేశామన్నారు. కాగా కాంగ్రెస్ నాయకులు రైతుబంధు ఆపాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారని వాపోయారు. వాళ్లు ఎన్ని కుట్రలు, కుతంత్రలు చేసినా గెలవలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. 13 ఏళ్లుగా మైనంపల్లి మెదక్ నియోజకవర్గం మరిచి పోయారని, ఆయన కేవలం గిన్నెలు, గ్లాసులు ఇచ్చిండన్నారు. నీళ్ళు లేనప్పుడు బోర్లు ఎందుకు వేయలేదని, ఇప్పుడెందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. ఆమె వెంట మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, బాలాగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రేం రాథోడ్ పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరుతున్న ఇతర పార్టీ నాయకులు

పథకాల నిలిపివేతకు కాంగ్రెస్ కుట్ర

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వ పథకాలను ఆపివేయించాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రామాయంపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు గమనించారని ఆమె కోరారు. కాట్రియాల, రాయిలాపూర్ గ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన వారు ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటా

కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్

కోహీర్(జహీరాబాద్): తనను గెలిపిస్తే జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేసి పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని జహీరాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మద్రి, గురుజువాడ, రాజనెల్లి, పీచేర్యాగడి, పీచేర్యాగడి పాత, కొత్త తండాలలో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. వికారాబాద్‌లో చేసిన అభివృద్ధికి అక్కడి ప్రజలు ఆదరించి ఐదు సార్లు గెలిపించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని, దాని స్థలాన్ని అమ్మడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కర్మాగారాన్ని తెరిపిస్తానని హామీ ఇచ్చారు. రైతుల సౌకర్యార్థం కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో 9 వేల పాఠశాలలు మూసివేయించి 18 వేల బెల్టు షాపులను తెరిపించారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఉపాధ్యక్షులు షాకీర్‌అలీ, జెడ్పీటీసీ రాందాస్, రామలింగారెడ్డి, రాచయ్య, అర్షద్ అలీ, మల్లన్న పాటిల్, రాములు నేత, మోహిసిన్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.


మాచిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుగులేని ట్రబుల్ షూటర్

- ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచి.. ఏడోసారి బరిలో..
- ప్రతీ ఎన్నికలో హరీశ్ రికార్డు
- 24వేల నుంచి ప్రారంభమై 1.18లక్షల మెజార్టీ
- ఈ సారి మరింత పెరిగే అవకాశం



సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట ఎమ్మెల్యేగా వరుసగా ఆరుసార్లు గెలిచి తన్నీరు హరీశ్ రావు రికార్డు సృష్టించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడోసారి బరిలో నిలిచారు. పోటీ చేసిన ప్రతీసారి సిద్దిపేట ఓటర్లు ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తున్నారు. ప్రతీ ఎన్నికల్లో హరీశ్ మెజార్టీ పెరుగుతూ వస్తోంది. 2004లో కరీంనగర్ లోక్‌సభకు కేసీఆర్ కూడా ఎన్నిక కావడంతో సిద్దిపేట ఎమ్మెల్యేకు రాజీనామా చేశారు. 2004లో జరిగిన ఉప ఎన్నిక నుంచి హరీశ్ రావు సిద్దిపేట ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. 2004 ఉప ఎన్నిక నుంచి 2018 వరకు ఆరు మార్లు ఎన్నికలు జరగగా అందులో మూడు సార్లు ఉప ఎన్నిక, మరో మూడు మార్లు జనరల్ ఎన్నికలు జరిగాయి. ఎప్పుడు ఎన్నికలు జరిగినా హరీశ్ సిద్దిపేట నుంచి అధిక మెజార్టీని సాధిస్తున్నారు. 2004 ఉప ఎన్నికల్లో 24,827 ఓట్ల మెజార్టీతో ప్రారంభించిన విజయపరంపర... 2018 ఎన్నికల్లో 1,18,699 మెజార్టీతో గెలుపొందే వరకు కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రెండు మార్లు హరీశ్ రావు తన ఎమ్మెల్యే పదవికి, ఒకసారి మంత్రి పదవికి రాజీనామా చేశారు. పోటీ చేసిన ఇతర పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతవుతున్నాయి. హరీశ్‌రావుకే తమ ఓట్లు అని ఇప్పటికే పలు గ్రామాలు, సంఘాలు గంపగుత్తగా తీర్మానాలు చేశాయి. దీంతో ఈ సారి మెజార్టీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఓటమి ఎరగని నేతగా ఆరడుగుల బుల్లెట్, ట్రబుల్ షూటర్ హరీశ్ రావు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

హరీశ్‌రావు మెజార్టీ వివరాలు

సంవత్సరం	పోలైన ఓట్లు	పొందిన ఓట్లు	మెజార్టీ
2018	1,67,113	1,31,295	1,18,699
2014	1,50,141	1,08,699	93,328
2010(ఉ.ఎ)	1,32,422	1,08,779	95,858
2009	1,32,031	85,843	64,677
2008(ఉ.ఎ)	1,13,405	76,270	58,935
2004(ఉ.ఎ)	1,15,458	64,374	24,827

నగదు స్వాధీనం

హుస్నాబాద్: పట్టణంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గురువారం నగదు పట్టుబడినట్లు సీఐ కిరణ్ తెలిపారు. ఏన వద్ద హుస్నాబాద్ నుంచి అక్కన్నపేటకు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.62లక్షల నగదును అక్కన్నపేట ఎస్సై వివేక్, హుస్నాబాద్ హెడ్ కానిస్టేబుల్ మొగిలి నాయక్‌లు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించారు.

మద్యం పట్టివేత

సిద్దిపేటకమాన్: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు. శాంతి నగర్‌లో వంగ ఐలేష్ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందటంతో గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.35వేల విలువగల 56 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దుబ్బాక అభివృద్ధిలో నాదే కీలకపాత్ర

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రామారం, గొల్లపల్లి, ఉదయపూర్, సయ్యద్‌నగర్ గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మెడలు వంచి నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. ప్రభుత్వానికి బెల్ట్‌షాపులపై ఉన్న దృష్టి ప్రజా సమస్యలపై లేదని ఆరోపించారు. దుబ్బాక సమస్యలపై తాను అసెంబ్లీలో గళమెత్తి పరిష్కారానికి కృషి చేశానన్నారు. మరోసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న రఘునందన్‌రావు

మహిళ ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): తొగిట గ్రామానికి చెందిన తలారి సాయిలు కూతురు హేమలత(23)ను చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్‌కు చెందిన శేఖర్‌తో వివాహమైంది. కొంతకాలంగా ఆమె తల్లిగారింటి దగ్గరే ఉంటుంది. అనారోగ్యానికి గురైన హేమలత గురువారం ఇంట్లో ఉరేసుకుంది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ఫ్లాగ్‌మార్చ్‌తో భరోసా

గజ్వేల్ ఏసీపీ రమేష్

వర్గల్(గజ్వేల్): ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ, ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి వర్గల్‌లో కేంద్ర బలగాలు, జిల్లా పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సిడెంట్ ఫ్రీ ఎలక్షన్స్ కోసం బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ జానకి రాంరెడ్డి, గౌరారం ఎస్సై విజయభాస్కర్, ఏఎస్సై మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వర్గల్‌లో పోలీసు, కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి కోరారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన 15 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఆశ చూపి కాంగ్రెస్ కార్యకర్తలకు బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై నమ్మకం లేక కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరేశం, నర్సింహ్మాచారి, ఎల్లు బాపురెడ్డి, బాల్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, దాసరి నర్సింలు, ముష్టం శ్రీనివాస్‌గౌడ్, ఎర్రోళ్ళ మల్లేశం, రమేష్, బాలయ్య, స్వామి, కొండల్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కూతురు పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక..

- పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

నంగునూరు(సిద్దిపేట): అప్పుల బాధతో పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజగోపాల్‌పేట గ్రామానికి చెందిన మొగిళ్ల మల్లేశం (48) రెండేళ్ల క్రితం కూతురు పెళ్లి కోసం రూ.6 లక్షలు అప్పు చేశాడు. దాని విషయమై బుధవారం ఇంట్లో గొడవ జరిగింది. దీంతో సిద్దిపేటకు వెళ్లిన మల్లేశం గడ్డి మందు తాగి ముండ్రాయి శివారులోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఇది చూసిన గ్రామస్తులు సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.


మల్లేశం (ఫైల్)

కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే కష్టాలే..

బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఆదరించి గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తానని జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వేచరేణి, తాడూరు, చిట్యాల, దానంపల్లి, దొమ్మాట, గుర్జకుంట గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో మీరందరూ ఆదివారం ఎమ్మెల్యే అని పిలుచుకున్న వ్యక్తి మళ్లీ మీ ముందుకు వస్తున్నాడని, అతను కావాలా..? నిత్యం మీతో ఉండే నాయకుడు కావాలో ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు చేస్తే కష్టాలు తప్పవన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరుగుతుందన్నారు. అనంతరం ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. తాడూరులో కొందరు మహిళలు మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని పల్లా దృష్టికి తీసుకురాగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఆప్కోచైర్మన్ మండల శ్రీరాములు, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఉల్లంపల్లి కరుణాకర్, సుంకరి మల్లేశంగౌడ్, అనంతుల మల్లేశం, పెడతల ఎల్లారెడ్డి, ఏనుగుల దుర్గయ్య, ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, బుర్ర సబితశ్రీనివాస్, తాడెం రంజిత, మీస పార్వతి తదితరులు పాల్గొన్నారు.


చిట్యాలలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్యం మత్తులో బలవన్మరణం

దౌల్తాబాద్(దుబ్బాక): దొమ్మాట గ్రామంలో బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పెద్దబుల్లి కురమ కొమురయ్య(53) అనారోగ్యానికి గురై మద్యానికి బానిసయ్యాడు. రోజుమాదిరిగా బుధవారం ఉదయం మద్యం తాగి భార్య లక్ష్మితో గొడవ పడ్డాడు. బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడి కొడుకు కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దళితులకు నిత్యం అండగా ఉంటా

బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): దళితులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని తొగర్‌పల్లి శివారులో దళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొని ఆయన మాట్లాడారు. మీ లాంటి కార్యకర్తలు దొరకడం తన అదృష్టమని తెలిపారు. మండలంలో దళిత భవన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. నిత్యం సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, తనను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏర్రొల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

బీఆర్ఎస్‌లో చేరికలు

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధి మాచిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ చెందిన మైనార్టీలు చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభాకర్ గెలుపునకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరాములుగౌడ్, శ్రీశైలం, యాదయ్య, రత్నాకర్‌రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్, సంగన్న, సలావుద్దీన్, షబ్బీర్, సాదత్, జలీల్ పాల్గొన్నారు.

రైతుబంధు ఆపాలని యత్నం

మునిపల్లి(అందోల్): రైతు బంధు మంజూరు కాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని బీఆర్ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బుదేరాలో ఆయన మాట్లాడుతూ.. యాసంగి పంటలకు సంబంధించి పంట పెట్టుబడి కోసం సీఎం కేసీఆర్ రైతు బంధు మంజూరు చేస్తే కాంగ్రెస్ నాయకులు దానిని అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. 60 ఏళ్ల పాలించిన కాంగ్రెస్ రైతులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. పనికి మాలిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనే భయం కాంగ్రెస్ నాయకులకు పట్టుకుందన్నారు. అందోల్‌లో చంటి క్రాంతికిరణ్ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, విజయ్ కుమార్, శశికుమార్, శివశంకర్, నవాజ్‌రెడ్డి, భాస్కర్, పాండు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు